www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 6 సెప్టెంబరు 2025

5

చిత్తూరు



గజరాజుల దాడి

వ్యవసాయ పంటలు ధ్వంసం

ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల మండలం పాతపేట పంచాయతీలో శుక్రవారం తెల్లవారు జామున వ్యవసాయ పంటలపై ఏనుగులు దాడిచేసి విధ్వంసం సృష్టించాయి. పాతపేట గ్రామానికి చెందిన సోమశేఖర్, నారాయణ, శంకర, సురేష్, జయమ్మ తదితర రైతులకు చెందిన వేరుశనగ, టమోటా, కొబ్బరి చెట్లు, మామిడి చెట్లను తొక్కి ధ్వంసం చేశాయి. రైతుల వ్యవసాయ మోటారు పంపులు, డ్రిప్ పైపులను తొక్కి నాశనం చేశాయి. దీంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది.



ధ్వంసమైన పంటలను అటవీ శాఖ అధికారులు పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులదే..

ఉపాధ్యాయుల సన్మానోత్సవంలో కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయ పాత్ర కీలకమని, ఉపాధ్యాయ పని వృత్తి కాదని, సమాజం రూపు రేఖలు మార్చే శక్తి అని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. అలాంటి ఉపాధ్యాయుల్ని సత్కరించుకోవడం మన బాధ్యత అన్నారు. డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా స్థానిక జెడ్పీ కార్యాలయంలోని ఎన్టీఆర్ సమావేశ మందిరంలోఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తరగతి గదిలో పిల్లల భవిష్యత్తును తీర్చి దిద్దే ఉపాధ్యాయులు సమాజంలో గౌరవ ప్రదమైన వారని, వారిని సన్మానించుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. తరగతులకు ముందు, తరువాత విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచడం చాలా కష్టమన్నారు. తరగతిలో బాగా ముందున్న, వెనుకబడిన, మధ్యలో ఉన్న విద్యార్థులందరినీ ఒకతాటిపైకి తీసుకొని రావటానికి ఎంతో శ్రమించాలన్నారు. తరగతులు చెప్పడానికి ముందు పాఠ్యాంశాలను అవగాహన చేసుకొని ఉపాధ్యాయులు తరగతులకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న పేద విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకురావాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై వుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు పేద పిల్లలను దత్తత తీసుకొని వారి అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఒక ఉపాధ్యాయుడు సంవత్సరకాలంలో దాదాపు 50 మందికి , తన సర్వీస్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

లో దాదాపు 1500 మంది ఉత్తమ విద్యార్థులను తయారు చేసే సామర్థ్యం ఉంటుందన్నారు. విద్యారులకు విద్యా బుద్ధులు నేర్పి మంచి విద్యావంతులుగా ఉన్నతమైన మార్కులతో పాటు సమాజంలో సత్ప్రవర్తనతో మెలిగే అలవాటు నేర్పితే విద్యార్థులు భవిష్యత్తులో సమాజ సేవలో నిమగ్న మవుతారని తెలిపారు. నవ సమాజ స్థాపనకు విద్యార్థులలో స్ఫూర్తిని నింపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగం అభివృద్ధికి అధిక శాతం నిధులు కేటాయించిందని మారు మూల గ్రామాల వరకు మెరుగైన విద్యా విధానం అమలుకావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను ఎప్పటికప్పుడు జిల్లాలో అమలు చేయడానికి సహకరిస్తున్న జిల్లా అధికారులను అభినందించారు. ఉపాధ్యాయులపై అదనపు భారం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, .డియస్సీ ద్వారా ఉపాధ్యాయులు నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నా రు. విద్యార్థులు సెల్ ఫోన్ వినియోగం తగ్గించేలా తల్లిదండ్రులకు చెప్పాలని, డ్రగ్స్ వాడకం పై, టివి చూడటం వంటి వాటిపై తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. పండు గ వాతావరణంలో



సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించ డం ఆనందంగా ఉందన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలో గొప్పవారి నందరిని తీర్చిదిద్దింది ఉపాధ్యాయులే నని పేర్కొన్నా రు. పూతలపట్టు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యా యుల కోసం ఒక దినోత్సవాన్ని జరుపు కోవడం ఉపాధ్యాయులు గర్వపడాల్సిన విషయమన్నారు. ఉపాధ్యాయులు బోధనాంశాలతో పాటు నైతిక విలువలు, మన సంస్కృతీ, సంప్రదాయాల గురించి కూడా బోధించాలని తెలిపారు.

70 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులు 70 మందిని కలెక్టర్, ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, మురళీమోహన్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు మేయర్ అముద, డిఇవో వరలక్ష్మి, సర్వ శిక్ష అభియాన్ పీడీ వెంకటరమణ, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజులు, జిల్లా పరిషత్ సీఈఓ రవి నాయుడు, ఎస్‌సి కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ యుగంధర్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దోమలు బాబోయ్..దోమలు!

- డ్రైనేజీల మురుగునీరు అస్తవ్యస్తం
- ఖాళీ స్థలాల్లో దోమల విజృంభణ
- భయాందోళనలో పట్టణ, నగర వాసులు


ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పట్టణ, నగర వాసులు దోమలు బెడద తట్టుకోలేక పోతున్నారు. అస్తవ్యస్తమైన డ్రేనేజి వ్యవస్థ, మురుగునీటి నిల్వల, ఖాళీస్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు.. ఇవి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దోమల నివారణ కోసం ఏటా లక్షల రూపాయలు పట్టణ, నగర పాలక సంస్థలు ఖర్చు చేస్తున్నా దోమల వృద్ధిని మాత్రం అరికట్టలేకపోతున్నారు. ఫలితంగా స్వైర విహారం చేస్తున్న దోమలు ప్రజల్ని విష జ్వరాలకు గురి చేస్తున్నాయి.

పరిస్థితి అస్తవ్యస్తం

పట్టణ, నగర ప్రాంతాల్లోని అర్బన్ హెల్త్‌సెంటర్లలో రోజుకు సరిసరి 10 మందికి పైగా జ్వరపీడితులు అడ్మిట్ అవుతున్నారు. వర్ష కాలం ముందే దోమల నివారణ కోసం తీసు కోవాల్సిన జాగ్రత్తలు, ప్రజలను అప్రమత్తం చేయడంతో విఫలమైన నగర పాలక, మున్సిపాల్టీల వైద్య విభాగాల వల్ల ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. జూన్ నుండీ వర్షాల సీజన్ ప్రారంభమైంది. దోమల నివారణ కోసం అప్పటి నుండీ చర్యలు తీసుకోవాల్సి వుంది. ముఖ్యంగా వర్షకాలంలో వాతావరణం తేమగా ఉంటూ దోమల వృద్ధికి అనుకూలంగా ఉంటుంది. ఈ సీజన్‌లోనే అధికంగా ప్రజలు డెంగీ, మలేరియా, చికన్‌గన్యా, ఫైలేరియా వంటి జ్వరాల బారిన పడుతుంటారు. దోమల నివారణ కోసం డ్రైనేజీల్లో మందు చల్లడం, ఫాగింగ్ యాత్రాల ద్వారా పొగను వదలడం వంటి చర్యలు చేపట్టాలి.

పారిశుధ్య నిర్వహణకు చర్యలు ఏవి?

చిత్తూరు జిల్లాలో చిత్తూరు కార్పొరేషన్‌తో పాటు, కుప్పం, పలమనేరు, నగరి మున్సిపాటీ లున్నాయి. దాదాపు అన్ని మున్సి పాలిటీల్లో దోమల నివారణ కోసం వారానికో రోజు మున్సిపల్ సిబ్బంది ఫాగింగ్ (పొగ) వెదజల్లడం చేయాల్సి ఉంటుంది. చిత్తూరు కార్పొరేషన్‌తో సహ మున్సిపాలిటీల్లో కూడా ఎక్కడా ఈ యంత్రాలు కనిపించడం లేదనే విమర్శ లున్నాయి. జనాభాకు తగ్గటుగా పారిశు ధ్య కార్మికులు లేకపోవడం వల్ల ప్రజా ఆరోగ్యంపై దృష్టిసారించడం కష్టంగా మారుతోంది. సాలిడ్‌వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనల ప్రకారం ప్రతి వెయ్యి జనాభాకు నాన్ పబ్లిక్ హెల్త్ కార్మికుడు



చొప్పున చిత్తూరు కార్పొరేషన్ జనాభా 2 లక్షల 50 వేలకు పైగా ఉన్నాయి. సగం మంది మాత్రమే పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. సాలిడ్ మేనేజ్‌మెంట్ రూల్స్ 2025 మేరకు ప్రతి 500 జనాభాకు ఒక పారిశుధ్య కార్మికుడు చొప్పున చిత్తూరు కార్పొరేషన్ జనాభాకు తగ్గట్లుగా 483 మంది పారిశుధ్యకార్మికులు అవసరం ఉంటే 407 మంది మాత్రమే పని చేస్తున్నారు. 76 మంది పారిశుధ్య కార్మికులు తక్కువగా ఉన్నారు. ఇందులో రెగ్యులర్ 100 మంది మాత్రమే కావడం వల్ల పారిశుధ్య కార్యక్రమాలు నిర్వ హించడం కష్టంగా మారుతోంది. ఇదే తరహాలో పంపు ఆపరేటర్లు, విద్యుత్ లైట్ల మేనేజ్మెంట్ కార్మికులు కార్పొరేషన్ కోటా మేరకు కేటాయించిన పోస్టులు భర్తీ చేయకపోవడంతో పారిశుధ్యం, నీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ లోపిస్తోంది.

ప్రజల నుండి నీటిపన్ను, ఆస్తిపన్ను వసూలు చేస్తున్న మున్సిపాలిటీలు ప్రజా ఆర్యోగం, వీధిలైట్ల నిర్వహణ, నీటి సరఫరా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మరో వైపు చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో ఎల్ఈడి పేరిట ఏర్పాటు చేసిన వీధి దీపాలు బుడ్డీ దీపాల కంటే తక్కువ వెలుగునిస్తున్నాయి. రాత్రి పూట జనసంచారం తక్కువ ఉండే ప్రాంతాల్లో వీధిలైట్లు ఉన్నా ఏమాత్రం ప్రయోజనం లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల నుండీ వసూలు చేస్తున్న పన్నులు ప్రజా అవసరాల కోసం ఖర్చు చేసి డ్రైనేజీలను శుభ్రం చేసి దోమలు లేకుండా ప్రజలకు వ్యాధులు రాకుండా చర్యలు తీసు కోవాలని ప్రజలు కోరుతున్నారు.



తిరుపతి కలెక్టర్ కు వినాయకుని చిత్రపటం బహూకరిస్తున్న ఈవో పెంచలకిషోర్

వరసిద్ధి వినాయకుని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-ఐరాల: కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇఎస్ ఇంద్రేష్ , శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష , తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ సుగుణమ్మ వేరువేరుగా స్వామిని దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం ఈవో పెంచల కిషోర్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రం, చిత్ర పటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, కాణిపాకం ఎస్ఐ నరసింహులు పాల్గొన్నారు.



మూలన పడి నిరుపయోగంగా మారిన చెత్తసేకరణ వాహనం

వాహనం ఇలా.. చెత్త సేకరణ ఎలా?

- నిరుపయోగంగా చెత్త సేకరణ వాహనం
- లక్షల ఖర్చు వృథా
- స్పందించని అధికారులు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలంలోని కొత్త వెంకటపురం గ్రామ పంచాయతీలో ప్రజలు పడేసిన చెత్త సేకరించి సంపద ఉత్పత్తి కేంద్రాలకు తరలించేందుకు ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించి ఈ ఆటోలు అందించింది పొడి, తడి చెత్త వేరువేరుగా వేసేందుకు ఆటోల విభాగాలు ఏర్పాటు చేశారు. చెత్త సేకరణ నిర్వహించిన కొద్ది రోజులకే మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. దీంతో రూ. లక్షలు వెచ్చించి కొనుగోలుచేసిన ఆటోలు తుప్పుపట్టి నిరుపయోగంగా మారాయి. అధికారులు స్పందించి బాగు చేస్తే లక్ష్యం నెరవేవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎరువుల సరఫరాలో లోపాలు వుంటే చర్యలు

అధికారులకు కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరిక

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్, (యాదమరి):

ఎరువుల నిల్వలు తక్కువగా ఉన్న సొసైటీలకు వెంటనే యుద్ధప్రాతిపదికన ఎరువులు సరఫరా చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను శుక్రవారం ఆదేశించారు. జిల్లాలో రైతులకు ఎరువుల పంపిణీలో వ్యవసాయాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సరఫరాలో ఎక్కడైనా లోపాలు వుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల పరిధిలో ప్రస్తుత ఎరువుల నిల్వలు, రానున్న వారానికి అవసరమైన ఎరువుల వివరాలను మండల వ్యవసాయాధికారి నివేదికల సిద్ధం చేయాలి కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలో ఎరువులు పారదర్శకంగా ప్రణాళికాబద్ధంగా సరఫరా చే యాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎరువుల సరఫరాలో జిల్లాలో ఎక్కడైనా అధిక మోతాదులో పంపిణీ చేసిన సంఘటనలను గుర్తిస్తే వెంటనే వాటిపై పూర్తిస్థాయి విచారణ చేసి నివేదిక సమర్పించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసు కుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రైవేట్ డీలర్ల వద్ద పెద్దమొత్తంలో యూరియా నిల్వలు లేకుండా ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఎరువుల సరఫరాలో ఎక్కడైనా లోపాలు జరిగినట్లు గుర్తిస్తే ఏ ఒక్కరినీ వదిలేది లేదని, వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. డీలర్ల వద్ద ఎరువుల రైతులందరికీ వారికి అవసరమైన ఎరువులు అందించేలా చర్యలు తీసు కోవాలని, మోతాదుకు మించిన ఎరువులు రైతులు వినియోగిం చకుండా, ఎరువుల అధిక వినియోగం వలన కలిగే అనర్థాలను రైతులకు తెలపాలన్నారు. జిల్లాలో అవసరమైన ఎరువులు నిల్వలు ఉన్నాయని, ఎటువంటి ఆందోళన చెందవద్దని రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ఎరువులు పంపిణీలో ఎలాంటి సమస్యలు లేకుండా మార్క్ ఫెడ్ శాఖతో సమన్వయం చేసుకుని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పర్యవేక్షణ చేయాలనీ కలెక్టర్ ఆదేశించారు. కల్తీ ఎరువుల బారిన రైతులు పడకుండా గుర్తింపు పొందిన దుకాణాలలో మాత్రమే కొనుగోలు చేసి బిల్లులను తప్పనిసరిగా అడిగి తీసుకొవాలని రైతులకు కలెక్టర్ సూచించారు.

జిల్లాలో యూరియా నిల్వలు

ప్రస్తుతం జిల్లాలో 2200 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయి. ప్రైవేట్ దుకాణాలలో 307 మెట్రిక్ టన్నులు, పిఏసీస్, డిసిఎంఎస్‌లలో 27 మెట్రిక్ టన్నులు, మార్కెట్ గోడౌన్స్‌లో 50 మెట్రిక్ టన్నులు, జిల్లాలో 2600 మెట్రిక్ టన్నులు రైతుల కు అందుబాటులో వున్నాయి. రాబోయే పది రోజుల్లో మరో 2,500 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానుంది. రైతులు



తప్పని సరిగా తమ వేలిముద్రలు నమోదు చేసుకుని ఆధార్ అధీకత విధానం ద్వారా యూరియా కొనుగోలు చేసుకోవచ్చు.

అధికంగా వినియోగిస్తే చీడపీడల బెడద

అధికంగా ఎరువులను వినియోగిస్తే, చీడ పీడలు పెరిగే అవకాశం ఉంది. నిర్దేశించిన మోతాదు లోనే యూరియా ను వినియోగించాలని సూచించారు. జిల్లాలో పశుగ్రాసం కోసం ఎక్కువగా యూరియాను వినియోగిస్తున్నారు. రైతులకు ఎలాంటి అంతరాయం కలగకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా అందుబాటులో తెస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సమద్ధిగా మరింత యూరియా ఎరువుల సరఫరా అవుతుంది. ముందస్తుగా కొనుగోలు చేయవద్దని సూచించారు. అధిక ధరలకు యూరియా అమ్మితే సమీపంలో ఉన్న మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలి. ఎరువుల చట్టం ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు.

యూరియా సరఫరాలో ఇబ్బందులు ఉంటే ఈ నెంబరులో సంప్రదించవచ్చు.

సబ్ డివిజన్ వారీగా కంట్రోల్ విభాగం ఫోన్ నెంబర్లు

చిత్తూరు డివిజన్ - 8331057748

పలమనేరు డివిజన్ - 8331057779

పుంగనూరు డివిజన్ - 8331057746

నగరి డివిజన్ - 8331057750



పరమసముద్రం చెరువులో గాలిస్తున్న దృశ్యం

ఈతకెళ్లి ఇద్దరు మృతి

పరమసముద్రం చెరువులో ఒకరు.. నగరి చెరువులో మరొకరు..

సరదాగా ఈత కెళ్లి వేరువేరు చెరువుల్లో ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన సంఘటనలు కుప్పం, నగరి మండలాల్లో శుక్రవారం చోటు చేసుకున్నాయి.

ప్రజాశక్తి-కుప్పం: సరదాగా ఈతకెళ్లి ఓ యువకుడు గల్లంతైన సంగటన కుప్పం మండలం పరమసముద్రం చెరువులో శుక్రవారం చోటుచేసుకుంది. పరమసముద్రం గ్రామానికి గ్రామానికి చెందిన చందన్ (16), రవీంద్ర (14), యువన్ శంకర్ (18) లు చెరువులో సరదాగా ఈత కొడుతుండగా యువన్ శంకర్ నీళ్లలో గల్లంతయ్యాడు. మరో ఇద్దరు యువకులు అతి కష్టం మీద గట్టుకు చేరుకున్నారు. యువన్ శంకర్ ఐటిఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గల్లంతైన యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం సెలవు కావడంతో సరదాగా స్నేహితులతో కలిసి చెరువు వద్దకు వచ్చిన యువన్ శంకర్ నీళ్లలో గల్లంతు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

చెరువుల వద్ద జాగ్రత్తలు పాటించండి: ఎమ్మెల్సీ

హంద్రీ-నీవా జలాలతో కుప్పం చెరువులు నిండుతున్న తరుణంలో చెరువులను చూసేందుకు వచ్చేవారు జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్సీ శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం మండలం పరమసముద్రం చెరువులో సరదాగా ఈతకొట్టేందుకు వచ్చి యువకుడు గల్లంతవడం అత్యంత బాధాకరమన్నారు. కృష్ణా జలాలతో కుప్పం ప్రాంత చెరువులు త్వరలోనే నిండుకుండలా మారిపోతుందని చెరువుల వద్ద కృష్ణమ్మని చూసేందుకు వచ్చేవారు జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. చెరువుల్లో గుంతలు అధికంగా ఉండడంతో ఈత కొట్టేందుకు వెళ్లి ప్రమాదాల బారిన పడొద్దని ఆయన హెచ్చరించారు. పరమ సముద్రం చెరువులో గల్లంతైన యువకుడి కోసం ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారన్నారు. చెరువులో గల్లంతైన యువకుడి తల్లిదండ్రులను ఆయన టిడిపి నేతలతో కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రెస్కో చైర్మన్ ప్రతాప్, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

చెరువులో పడి మరొకరు మృతి



మృతి చెందిన యువరాజ్

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : మున్సిపల్ పరిధి కేవీపీఆర్‌పేటకు చెందిన నేత కార్మికుడు ఆరుముగం కుమారుడు యువరాజ్ (14) శుక్రవారం చెరువులో పడి మృతి చెందాడు. పోలీ సు ల కథనం మేరకు నగరి పట్టణంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో 9వ తరగతి చదువు తున్న యువరాజ్ శుక్రవారం సెలవు రావడంతో స్నేహితులతో కలిసి గుండ్రాజుకుప్పం దళితవాడ సమీపం క్రికెట్ ఆడడానికి వెళ్లాడు. ఆట ముగిసిన సమయంలో మైదానానికి పక్కనే ఉన్న చెరువులో నీటిని చూసి అందులో ఈతకు దిగాడు. లోతు ఎక్కువై నీట మునిగిపోవడంతో మృతి చెందాడు. కాగా ఆరుముగంకు ఇద్దరు కుమార్తెలు ఉండగా యువరాజ్ ఒక్కడే కుమారుడు. కుమారుడు మృతితో ఆ కుటుంబం కన్నీరు మున్నీరైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తున్న..

విజ్ఞానజ్యోతి స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ మజూద్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎస్టేట్‌లోని విజ్ఞాన జ్యోతి స్కూల్ విద్యార్థులను రకరకాలుగా ఇబ్బంది పెడుతున్నారని విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ మసూద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం మిలాడినబీ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించిన సమయంలోనూ స్కూలు నిర్వహిస్తూ ప్రతిరోజూ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యార్థులను రకరకాలుగా మానసిక ఇబ్బందులు గురి చేస్తున్నారని తెలిపారు. దీని ప్రశ్నించిన ఎస్ఎఫ్ఐ నాయకులపై దురుసుగా ప్రవర్తించారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా పాఠశాలలు నిర్వహించాలని బలవంతంగా విద్యార్థులపై ఒత్తిడి తీసుకు రావద్దని డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలో అనేక పాఠశాలలో కనీస వసతులు కూడా లేకుండా నడుస్తున్నాయని విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

తుడాలో కలపండి..

తుడా ఛైర్మన్‌కు కార్వేటినగరం నాయకుల వినతి

ప్రజాశక్తి -కార్వేటినగరం: కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపాలని కోరుతూ కార్వేటినగరం మండలానికి చెందిన పలువురు కూటమి నాయకులు తుడా ఛైర్మన్, టీటీడీ బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. తిరుపతి జిల్లాకు సమీపంలో కార్వేటినగరం మండలం ఉందని, ప్రస్తుతం తిరుపతి తుడా పరిధిలో ఉందని తెలిపారు. తిరుపతి జిల్లాలో కలిపే విధంగా ముఖ్యమంత్రితో చర్చించాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని తుడా ఛైర్మన్ హామీ ఇచ్చారు. 2024 ఎన్నికలకు ముందు కార్వేటినగరంలో రోడ్ షోకి వచ్చిన అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో చేర్చుతామని హామీ ఇచ్చిన విషయాన్ని, లోకేష్ యువగళం పాదయాత్ర లో కత్తెరపల్లెకి



వచ్చినప్పుడు కార్వేటినగరాన్ని తిరుపతి జిల్లాలో కలిపే బాధ్యత నేను తీసుకుంటానని ఇచ్చిన హామీని కార్వేటినగరం యువత, టిడిపి నాయకులు డాలర్స్ దివాకర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చెంగలరాయులు యాదవ్, మండల కార్యదర్శి రాజేంద్ర రెడ్డి, టిడిపి నాయకులు జగన్నాథం, వాసుదేవ రెడ్డి, రవి యాదవ్, వెంకటకృష్ణ యాదవ్, మురళి, యువత రాజేష్, మునిరాజేష్, పాల్గొన్నారు.

టెక్నాలజీతో ఏనుగుల కట్టడికి చర్యలు

- త్వరలో 50 హెక్టార్లలో ఎకోటూరిజం ప్రాజెక్టు
- కుంకీ ప్రాజెక్టు ప్రతిష్టాత్మకం
- ఏనుగుల దాడి బాధితులకు నష్టపరిహారం పంపిణీలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: ఏనుగుల దాడుల నుంచి పంట, ప్రాణ నష్టాల నివారణకు ప్రభుత్వ పరంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే కుంకీ ఏనుగుల ప్రాజెక్టు తీసుకువచ్చా మన్నారు. త్వరలో టెక్నాలజీతో పాటు కుంకీల ద్వారా పూర్తిగా ఏనుగుల దాడులను నివారి స్తామని తెలిపారు. రైతుల పంటలకు నష్టం కలగకుండా ఏనుగుల కదలికలను గుర్తించే విధంగా చిప్‌ల ఏర్పాటుతో పాటు, హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్, కుంకీ ఏనుగుల ద్వారా కట్టడి చేయనున్నామని వివరించారు. ఇంకా కుంకీ ఏనుగుల ప్రాజెక్టుకు ఎదురుగా 50 హెక్టార్లలో ఎకో టూరిజం ప్రాజెక్టు త్వరలో కార్యరూపం దాల్చనుందని దీంతో ఆదాయం పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు ఈ ప్రాంత వాసులకు రానున్నాయన్నారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలోనే కుంకి ఏనుగుల ప్రాజెక్టు ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాంతంలో ఏర్పాటు అయ్యిందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఓవైపు రైతులకు మేలు చేస్తూ పర్యావరణ సమతుల్యాన్ని పాటించడంతో పాటూ జంతు సంరక్షణ, వాటి నుంచి దాడులను నివారించుకోవడం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

నష్ట పరిహారపు చెక్కులు పంపిణీ

పలమనేరు అటవీ రేంజ్ పరిధిలో ఏనుగుల దాడులతో పంట, ప్రాణ , ఆస్తి నష్టపోయిన 80 మంది బాధితులకు రూ 12.77 లక్షల విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే ఈ సందర్భంగా పంపిణీ చేశారు. అందులో పంట నష్టపోయిన 78 మందికి రూ. 7,02,840, పాడి ఆవు నష్టపోయిన ఓ రైతుకు రూ. 75 వేలు, ప్రాణనష్టం వాటిల్లిన బాధిత కుటుంబీకులకు రూ. 5 లక్షల పరిహారపు చెక్కులను ఆయన అందించారు. ఈ కార్యక్రమాలలో సబ్ డిఎఫ్‌వో వేణుగోపాల్‌రెడ్డి ఎఫ్ఆర్ఓ నారాయ ణ లతో పాటు ఎఫ్ఎస్ఓలు ఎఫ్‌బీవోలు, సిబ్బంది తో పాటు టిడిపి నా య కులు కిషోర్ గౌడ, ఆనంద, సోమశేఖర్ గౌడ్, నాగరాజు రెడ్డి, కుట్టి, జనసేన నాయకులు దిలీప్ కుమార్ పాల్గొన్నారు.



బాధితులకు నష్టపరిహార చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్న డిఎస్‌పి మహ్మద్ అజీజ్

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి -వెదురుకుప్పం : వెదురుకుప్పం మండలంలో బాలికల వసతి గృహం నగరి డిఎస్‌పి మహమ్మద్ అజీజ్ సంద ర్శించా రు. బాలికల చట్టం పై శుక్రవారం ఆయ న అవగాహన కల్పిం చారు. ఈ సందర్భం గా ఆయన మాట్లా డు తూ బాలికలపై జరిగే అఘాయిత్యాలపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేసి బాలికలకు అవగాహన కల్పిస్తూ వారికి సెల్ఫ్ డిఫెన్స్ ఎలా చేసుకోవాలి? అని అవగాహన కల్పించారు. ఈ 50 మంది బాలికలకు పుస్తకాలు పెన్నులు, పెన్సిళ్లు అందించారు. ఈ కార్య క్ర మంలో ఆయన వెంట వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు నియోజకవర్గ పరిధిలో ఇద్దరు లబ్ధిదారులకు రూ.16.25 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పంపిణీ చేశారు. శుక్రవారం బీవీ రెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో చెక్కులను లబ్ధిదారులకు అందించారు. చిత్తూరు రూరల్ మండలం ఎగువ కండిక గ్రామానికి చెందిన మానసకు బోన్ కి సంబంధించి చికిత్స కోసం రూ.9.75 లక్షల చెక్కులు అందించారు. చిత్తూరు పదో వార్డుకు చెందిన గిరిధర్ లివర్ సంబంధిత చికిత్స కోసం రూ.6.50 చెక్కులు పంపిణీ చేశారు. వైద్య చికిత్సల కోసం సహాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్‌కు లబ్ధిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రఘు, శ్యామ్, మేషక్, మోహన్ రాజ్, కంద, పచ్చయప్ప, మునిరత్నం పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలు దిల్షాద్ బేగంను సన్మానిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం

ప్రజాశక్తి-రొంపిచర్ల: పులిచెర్ల మండలం కల్లూరు లయన్స్ క్లబ్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ క్రీడా విభాగం అధ్యక్షుడు మహమ్మద్ అలీ అధ్యక్షతన శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయురాలు హిందీ పండిట్ దిల్షాద్ బేగంను ఘనంగా సన్మానించి, ఆమెకు ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. ఆమె 25 ఏళ్లుగా విద్యాభివృద్ధికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సిబ్బంది, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇర్ఫాన్‌అలీకి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - రొంపిచర్ల :

రొంపిచర్ల మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఇర్ఫాన్ అలీ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. ఇర్ఫాన్ అలీ స్కూల్ డెవలప్మెంట్ పనుల్లో ఉత్తమ సేవలు అందించినందుకు అవార్డుకు ఎన్నికయ్యారు అని తెలిపారు. ఇర్ఫాన్ అలీ కి శుక్రవారం చిత్తూరులో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో పూతలపట్టు చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురజాల జగన్మోహన్ శాలువా కప్పి సన్మానించి జ్ఞాపిక అందించారు. ఇతను 27 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో విద్యా బోధన, విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంతో అనుబంధంగా ఉండే వారిని, సి ఆర్ సి సెక్రటరీగా, జాయింట్ సెక్రటరీగా ఉంటూ శిక్షణ అందించారని ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న శేషగిరిరావు

శేషగిరిరావుకు..

ప్రజాశక్తి -బంగారుపాలెం:

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా గణిత ఉపాధ్యాయుడు శేషగిరిరావు ఎంపికయ్యారు. మండలంలోని గుండ్ల కట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులుగా విధులు చేపట్టి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. శుక్రవారం చిత్తూరులో గురుపూజోత్సవలో కలెక్టర్ సుమిత్ కుమార్ ఎమ్మెల్యేలు, గురజాల జగన్మోహన్ నాయుడు, కలికిరి మురళీమోహన్ చేతుల మీదగా అవార్డు అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న ఉపాధ్యాయులు శేషగిరిరావును ప్రధానోపాధ్యాయులు భేరీనాథ్, జయప్రకాష్, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు అరుణ శివప్రసాద్ అభినందించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



రొంపిచర్లలో

ప్రజాశక్తి - రొంపిచర్ల : రొంపిచర్ల మండల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మండల స్థాయిలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డివైఈవో ఎన్ ఇందిరా మాట్లాడుతూ విద్యార్థులను మంచి పౌరులుగా తయారు చేయాలంటే ఉపాధ్యాయులే సమాజానికి కీలకం అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవానికి ముందు రోజు గురువారం మండలంలోని ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్ ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి డి శ్రీనివాసులు, రొంపిచర్ల మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కుప్పంలో

కుప్పం: సమాజ భవిష్యత్తును తీర్చిదిద్ది గురువుల కృషి ఎన్నటికీ మరువలేనిదని ఎమ్మెల్సీ శ్రీకాంత్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సమాజానికి ప్రేరణ విద్యార్థులకు మార్గదర్శకులన్నారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో శుక్రవారం టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుప్పం పిఇఎస్ ఆడిటోరియంలో జరిగిన టీచర్స్ డే వేడుకల్లో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. భావి భారత పౌరులను ఉత్తములుగా తీర్చిదిద్దే గురువులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యం గా భావించాలని కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, రెస్కో చైర్మన్ ప్రతాప్, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్ కుమార్, జనసేన నేత నరేష్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యాదమరిలో

యాదమరి: యాదమరి మండల కేంద్రంలో పిఆర్‌టియు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి అధ్వర్యంలో మండల శాఖ ఆధ్యక్ష ప్రధాన కార్యదర్శుల సహాయ సహకారాలతో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి విజయభాస్కరరెడ్డి, చిత్తూరు అర్బన్ సీనియర్ నాయకులు వేణుగోపాల్, హెచ్‌యం గిరిరాజా ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈకార్యక్రమంలో 10 మంది సీనియర్ టీచర్స్, రిటైర్డ్ ఉపాధ్యాయులు భాస్కర రావు, త్రివేణి, వెంకటేశ్ లకు వారి సేవలు గుర్తించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కనకాచారి, శివప్రసాద్, ఆనంద పిళ్లై, షహనజ్, ఆఖిలభాను, త్రివేణి, రమేష్, విశ్వనాధ్, హరికృష్ణ, తులసి ప్రసాద్, హేమకుమార్, హరి పాల్గొన్నారు.



ఎస్ఆర్ పురంలో

ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్‌పురం విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం మండల విద్యాధికారుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు అరుణాచలం రెడ్డి సబర్మతి, ఉపాధ్యాయురాలు దీనావతి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పాతపాలెం హేమలత, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మూలూరు శివకుమార్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గోపయ్య గుంట ,ఉత్తమ పాఠశాలలు గా 49. కొత్తపల్లి మిట్ట హెచ్ డబ్ల్యు , పుల్లూరు , గాండ్లపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలు మండలంలోని ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులను, మూడు ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేసి వారికి ఉపాధ్యాయులకు క్రీడల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. వీరితో పాటు మండలంలోని పాఠశాలలో ఉపాధ్యాయులు హాజరయ్యారు.

చౌడేపల్లి: మండలంలోని పలు పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. శెట్టిపేట పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేకల చిన్నేపల్లి లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు వివిధ రకాల ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. తమ గురువులను విద్యార్థులు ఘనంగా సన్మానించి, ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, మండల ఎస్‌టియు అధ్యక్షులు లింగమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు గోవింద్ ,విజయశ్రీ, మోహన్, లింగమూర్తి, రామకృష్ణ, మనోహర రాణి, చంద్రశేఖర్, నాగ మునికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



చౌడేపల్లిలో



నరసింహులు నాయుడు మృతి తీరని లోటు: వైసిపి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : వైసిపి సీనియర్ నాయకుడు బసివి రెడ్డి పల్లె గ్రామానికి చెందిన నరసింహులు నాయుడు మృతి పార్టీకి తీరని లోటని గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కృపాలక్ష్మీ అన్నారు. నరసింహులు నాయుడు భౌతికయానికి శుక్రవారం పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన కుమారుడు వెంకటరత్నం కు ధైర్యం చెప్పారు. తయ్యూరు పాయ కట్టు 18 గ్రామాలకు చెందిన ప్రజలు అంకనపల్లి మహాభారత కార్యకర్తలు, నాయకులు నరసింహులు భౌతికయానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు ఈయన మృతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షుడు మణి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, చిత్తూరు పార్లమెంట్ కార్యదర్శి అల్లాల విజయబాబు, కోటిరెడ్డి బాబు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు దొరసామి, ఎస్సీ సెల్ కార్యదర్శి కొత్తపల్లి సామి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




భారత్ సేవక్ సమాజ్ గవర్నమెంటు ఆఫ్ ఇండియా

జాతీయ పిఆర్‌ఓగా భాస్కరన్

ప్రజాశక్తి -విజయపురం (నగరి):

పీపుల్ ఫోరం ఆఫ్ ఇండియా నేషనల్ భారత్ సేవక్ సమాజ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు ఎస్ మనిమేలియన్ ఆదేశాల మేరకు జాతీయ జనరల్ సెక్రెటరీ డాక్టర్ మోహన్ ఆధ్వర్యంలో పిఎఫ్ఐ , ఎన్‌బిఎస్‌ఎస్ గవర్నమెంటు ఆఫ్ ఇండియా జాతీయ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా నగరి కి చెందిన వీటి భాస్కరన్‌కి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఐడి కార్డులు, సోషియల్ సర్వీస్ ఇష్యూ ఆర్డర్స్ సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో లీడర్లు డిబాబు, ఈ గోవిందస్వామి , కమలాకర్ , టిసి కృష్ణయ్య , నాగరాజ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

ప్రజాశక్తి-పలమనేరు:

పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని గంగవరం మండలం ఆలకుప్పం రాజన్న శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించారు. పలమనేరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తన పేరును ఖరారు చేయడంతో స్థానిక ఎమ్మెల్యేను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా ఆయన సామాజిక వర్గానికి చెందిన వాల్మీకి కులస్తులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యేను, రాజన్నను సన్మానించారు. నియోజకవర్గంలో వాల్మీకులకు ఏఎంసీ చైర్మన్ పదవిని కేటాయించడంపై వారు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డిపల్లి మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ్, గంగవరం మండల పార్టీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్,ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది ఎల్.భాస్కర్ లతో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించండి: టిడిపి



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- రామకుప్పం: రామకుప్పం బజారు వీధిలో రోడ్డు విస్తరణకు దుకాణదారులు, భవనాల యజమానులు సహకరించాలని టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద శుక్రవారం స్థానికులు, దుకాణ దారులతో సమావేశం నిర్వహించారు. రోడ్డు విస్తరణ, డివైడర్ ల ఏర్పాటుతో మంచి హంగులతో నిర్మాణం అవుతుందన్నారు. దీంతో పట్టనం అభివృద్ధి చెంది ప్రతి ఒక్క వ్యాపారి ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ప్రజా అభిప్రాయంతో త్వరలోనే మండల కేంద్రం మంచి రోడ్లతో ముస్తాబు అవు తుందన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకట మోహన్, నేతలు మునస్వామి, నారాయణాచారి, రామ్మూర్తి, చిన్ని కృష్ణ, విశ్వనాథ్, రఫీ, వెంకటరమణ, విజయ్, సురేష్, ,చలపతి, గుర్రప్ప, రామకృష్ణప్ప, రాజసింహ, కామరాజు నాయక్, మహేంద్ర, జయశంకర్, అలివేలు మంగమ్మ దుకాణదారులు పాల్గొన్నారు.

గురువులను గౌరవించాలి

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: తల్లిదండ్రులను, గురువులను గౌరవించడంతో పాటు భవిషత్ బాగుండాలంటే కష్టపడి చదవాలని ఆర్‌కె డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ బద్రినారాయణ అన్నారు. శుక్రవారం ఆర్‌కె డిగ్రీ కళాశాల 8వ ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అడిషనల్ ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక మార్పులకు అనుగుణంగా నైపుణ్యం పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలపతి,



ఆర్‌కె డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థు లు ఇష్టంతో చదివితే ఉత్తమ వ్యక్తిత్వం వస్తుదన్నారు. సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా యూనివర్శిటి స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యులు రామచంద్రయ్య, శ్రీరాములురెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలమనేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఆలకుప్పం రాజన్న

ప్రజాశక్తి- పలమనేరు:



కూటమి ప్రభుత్వం వచ్చిన 16 నెలల తర్వాత పలమనేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌ను రాష్ట్ర అధిష్టానం ప్రకటించింది. పలమనేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా గంగవరం మండలం ఆలకుప్పం రాజన్న నియ మితులయ్యారు. పలమనేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ కోసం నియోజవర్గంలో ఎంతో మంది ఆశావాహులు ఎదురు చూశారు. చివరగా రాజన్నను వరించింది.

బైరెడ్డిపల్లి ఉపాధ్యాయుడికి జిల్లాస్థాయి అవార్డు




అవార్డు అందుకుంటున్న ఉత్తమ ఉపాధ్యాయుడు ఎన్ శశికుమార్

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని వెంగమారిపల్లి ఉపాధ్యాయుడు ఎన్ శశికుమార్ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, డీఈవో వరలక్ష్మి, జిల్లా మేయర్ అముద చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాల్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, మండల ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది ఆయనను అభినందించారు. ఎంఈఓ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు శశికుమార్ 15 సంవత్సరాల పాటు ఇదే మండలంలో పనిచేశారని, పాఠశాలకు క్రమం తప్పకుండా రావడం వృత్తికి అంకితమైన వీరు విద్యార్థులను మోడల్ నవోదయ గురుకుల వంటి ప్రవేశ పరీక్షలు రాయించి ఎంతోమంది విద్యార్థులు ఎన్నికయ్యేటట్లు చేశారని తెలిపారు. సెలవు దినాలలో కూడా తమ పాఠశాల పిల్లలకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించడం ఉచితంగా కోచింగ్ ఇవ్వడం తన బోధనలో వినూతనమైన బోధనా పద్ధతులను పాటించడం పరిసర ప్రాంత ఉపాధ్యాయులు, పిల్లలతో తల్లితండ్రులతో మంచి సంబంధాలను కలిగి ఉండడం,తను పనిచేసిన పాఠశాలలో ఎన్రోల్మెంట్ ను పెంచడం, డ్రాప్ అవుట్ ను నివారించడం,లో కీలక పాత్ర పోషించడం జరిగిందన్నారు. ఈ మండలంలోని విద్యార్థులను రాష్ట్రస్థాయిలో చిత్రలేఖనం పోటీలో రెండవ స్థానం పొందడంలో కీలక పాత్ర పోషించారని, ఎల్ఐసి వారి ఉత్తమ పాఠశాల అవార్డును పొందడంలో కూడా ఇతని సహాయ సహకారాలు ఉన్నాయని, అందువలననే ఈయనకు జిల్లాస్థాయి అవార్డు రావడం హర్షించదగ్గ విషయమని ఈ సందర్భంగా తెలిపారు. మండల ఉపాధ్యాయులు అధికారులు జిల్లాస్థాయి అవార్డు పొందిన ఉపాధ్యాయుడికి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా జ్యోతి, చంద్రశేఖర్

ప్రజాశక్తి -కార్వేటినగరం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా కె జోతి, ఆటుకారు చంద్రశేఖర్‌లు శుక్రవారం అవార్డులు అందుకున్నారు. జ్యోతి పాదిరికుప్పం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులుగా, ఏడవ తరగతి ఇంగ్లీష్ పాఠ్యపుస్తకం రచయితగా విద్యా వ్యవస్థకు ఎనలేని సేవలు అందించడంతో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. మేజర్ పంచాయతీ కార్వేటి నగరంలో గుంట పాఠశాలలో విధులు నిర్వహిస్తూ విదార్థుల చైతన్యానికి ఎనలేని కృషి చేస్తూ, ఉత్తమ బోధనలు అందించిన ఆటుకారు చంద్రశేఖర్‌ను జిల్లా ఉత్తమ అవార్డు వరించింది. దీంతో జిల్లా విద్యాశాఖ కేంద్రంలో జిల్లా కలెక్టర్ సుమిత్కుమార్ ఆధ్వర్యంలో ఆవార్డులను అందుకున్నారు. వారికి ప్రసంసా పత్రం, షీల్డు అందించి శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ క్రమంలో భాగంగా జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీతలను ఉపాధ్యాయ సంఘాలు, పలువురు మేధావులు అభినందించారు.



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న చంద్రశేఖర్

విద్యార్థులకు జీజేఎం ఆర్థికసాయం

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: బెస్ట్ అవైలబుల్ స్కిమ్ రద్దు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్‌ను ఆశ్రయించారు. విద్యార్థుల కష్టాలు తెలుసుకున్న ఎంఎల్ఏ విద్యార్థులకు అండగా నిలుస్తూ తన సొంత నిధుల నుండీ ప్రతి విద్యార్థికి రూ.10వేలు సాయం అందించారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే సాయంపై విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.



అన్నదానం చేస్తున్న ముస్లిం సోదరులు

ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి -కార్వేటినగరం: మండల కేంద్రంలోని జామియా మసీదులో మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీద్ ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి హిందూ ముస్లిం సోదరులు సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను వేడుకున్నారు. ప్రవక్త చూపించిన సన్మార్గాన్ని జీవితాంతం ఆసరించాలని ప్రారించుకున్నారు. ఈ క్రమంగా భాగంగా మసీద్ ఆవరణంలో నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు.ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



అనుప్రియకు పరామర్శ

ప్రజాశక్తి - చౌడేపల్లి:

వైసిపి పుంగనూరు నియోజకవర్గ ఎస్సీ విభాగ అధ్యక్షురాలు అనుప్రియ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ నేపథ్యంలో జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి ఆమె నివాసం శికారి పాలెంకు చేరుకున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆమెను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్ నాయకులు మున్నా భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

చంద్రబాబు కృషి వల్లే కుప్పంకు నీళ్లు

మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు

ప్రజాశక్తి-రామకుప్పం:

కుప్పానికి హంద్రీ-నీవా సుజల స్రవంతిని తీసుకొచ్చిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుదే అని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 1989లో హంద్రీ-నీవా సుజల స్రవంతికి అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ భూమి పూజ చేసి ప్రారంభించారన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు 2014లో నిధులు కేటాయించి పనులు ప్రారంభించి 87 శాతం పనులు పూర్తి చేశారన్నారు. అనంతరం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రమౌళి 2017 లో కాలువ పనులు జరగనీయకుండా రైతుల వద్దకు వెళ్లి కోర్టులో కేసులు వేయించి పనులు ఆపించారన్నారు. 2019లో వైసిపి అధికారంలో ఉన్నప్పటికీ 13 శాతం పనులు కూడా చేయలేక పోయారన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నెల రోజులకే పనులు ప్రారంభించి సంవత్సరకాలంలో పూర్తి చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. వీకోట మండలం ఆదినేపల్లి వద్ద లిఫ్ట్ మిషన్ సాంకేతిక లోపంతో నాలుగు గంటలు పాటు ఆగింది. తర్వాత యధావిధిగా పరంసముద్రం చెరువు నిండిందన్నారు. నీరు ఆగిపోయిందని సోషల్ మీడియాలో మాఫింగ్ ఫొటోలు, వీడియోలతో ప్రచారాలు చేస్తే తగిన చర్యలు తప్పదని హెచ్చరించారు. డిసెంబర్ లో మిని ఏయిర్ స్ట్రిప్ పనులు ప్రారంభం అవుతుందని దీంతో. నియోజకవర్గంలో 14 కంపెనీలు ఏర్పాటుతో నిరుద్యోగులకు వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, ఆంజనేయ రెడ్డి,విశ్వనాథ్,చిన్ని కృష్ణ, చలపతి, రామ్మూర్తి,, రఫీ, జేయి, జయశంకర్, కామరాజ్ నాయక్, మనోహర్, రఘు వెంకటాచలం, వెంకటరమణ,మహేంద్ర,బాలు, సత్తి, అల్లి శీన, ఆదిల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్:

ప్రతి జిల్లా కేంద్రానికి ప్రభుత్వ వైద్య కళాశాల ఉండాలన్న ప్రభుత్వ విధానాన్ని అనుసరించి, చిత్తూరు జిల్లాకు వెంటనే ఒక ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలని చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాండవ మూర్తి, గోపినాయక్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులకు వారు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. చిత్తూరు జిల్లా రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన జిల్లాల్లో ఒకటిగా ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక్క వైద్య కళాశాల కూడా లేకపోవడం దురదృష్టకరం అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఇక్కడి విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తోందని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఇది ఆర్థికంగా భారంగా మారుతోందని వారు పేర్కొన్నారు.అన్ని జిల్లా కేంద్రాలకు ప్రభుత్వ వైద్య కళాశాల ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యం ప్రకారం చిత్తూరుకు కూడా ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని వారు పునరుద్ఘాటించారు. తాండవ మూర్తి, గోపినాయక్‌లు మాట్లాడుతూ, ఈ డిమాండ్ న్యాయమైనదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉందని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్లు, వైద్యులు, పరికరాల కొరత వంటి సమస్యలను అధిగమించడానికి వైద్య కళాశాల ఏర్పాటు ఎంతగానో తోడ్పడుతుందని వారు తెలిపారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించి, తక్షణమే ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే